సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శనివారం | 19 | అక్టోబర్ | 2024



రెజ్లింగ్ పోటీల్లో పతకాలు

హైదరాబాద్‌లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో ఉమ్మడి జిల్లా రెజ్లర్లు సత్తా చాటారు. -8లో▸



దేశం గర్వపడేలా విజయాలు సాధించాలి

ప్రపంచ వేదికపై భారతదేశం గర్వపడేలా విజయాలు సాధించాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. -8లో▸

గరిష్టం/కనిష్టం
$32^0 / 25^0$

వాతావరణం

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

23న డాక్టర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

ఎంజీఎం: జిల్లాలోని వడ్డేపల్లి పరిధి పూరిగుట్ట, పరకాలలోని బస్తీ దవాఖానాల్లో ఖాళీగా ఉన్న కాంట్రాక్ట్ డాక్టర్ పోస్టుల(02) భర్తీకి ఈనెల 23న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు హనుమకొండ డాక్టర్స్ కాలనీలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ కె.లలితా దేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు ఎంబీబీఎస్ డిగ్రీ కలిగి తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్టర్ అయి ఉండాలని, 18 నుంచి 40 సంవత్సరాలలోపు వయస్సు వారు విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. మెరిట్ ప్రాతిపదికన ఎంపిక జరుగుతుందని వివరించారు.

ఎంఏ తెలుగు కోర్సులో ప్రవేశాలు..

హన్మకొండ కల్చరల్: వరంగల్ హంటర్‌రోడ్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం జానపద విజ్ఞాన పీఠం ప్రాంగణంలో ఈనెల 23న ఎంఏ తెలుగు కోర్సులో అడ్మిషన్లు ప్రారంభం కానున్నట్లు జానపద విజ్ఞాన పీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్య బాబురావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 3న నిర్వహించిన ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు ఉదయం 10 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు మూడు సెట్ల జిరాక్స్ కాపీలు, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు వెంట తీసుకుని హాజరు కావాలని కోరారు.

డీఎంహెచ్‌ఓ ఏఓగా రాజేశ్‌కుమార్



ఎంజీఎం : హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం పరిపాలన అధికారిగా కోల రాజేశ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను డీఎంహెచ్‌ఓ లలితాదేవి, సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో డెమో వి.అశోక్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఫాతిమా, శ్యాం, హెచ్‌ఈఓ యదానాయక్, ఉత్తమ్, పద్మరాజు, డీపీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

21న ఐటీఐలో అప్రెంటిస్‌షిప్ మేళా..

వరంగల్: వరంగల్ ములుగు రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో ఈనెల 21న ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్ షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ చందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేళాలో ప్రముఖ కంపెనీలు తోషిబా, టాటా ఏరో స్పేస్, రెనా ఇంగస్ వాల్స్ పాల్గొంటున్నాయని తెలిపారు. ఐటీఐల్లో వివిధ ట్రేడుల్లో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు ఈ మేళాను వినియోగించుకోవాలని కోరారు. అప్రెంటిస్ సమయంలో నెలవారీగా స్టైఫండ్ చెల్లిస్తారని ఆసక్తి ఉన్నవారు బయోడేటా, దరఖాస్తు, సర్టిఫికెట్లతో సోమవారం ఉదయం 10:30 గంటలకు హాజరు కావాలని సూచించారు.

మున్సిఫ్ కోర్టు జడ్జి శశి బదిలీ

వరంగల్ లీగల్: వరంగల్ నాలుగో మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి జి.శశి జనగామకు బదిలీ అయ్యారు. ఆమెను జిల్లా ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్ కోర్టుకు ట్రాన్స్‌ఫర్ చేస్తూ హైకోర్టు అధికార వర్గాల నుంచి ఉత్తర్వులు అందాయి. త్వరలో అక్కడ బాధ్యతలు చేపట్టనున్నారు.

ఇన్నోవేషన్ 'ఓ సృష్టి'



హసన్‌పర్తి: ఇన్నోవేషన్ అనేది ఆచరణీయమైన కొత్త సమర్పణ ఓ సృష్టి అని ఎలక్ట్రికల్ ఆర్ అండ్ డీ సీనియర్ ప్రిన్సిపాల్ ఎంటర్ ప్రైజ్ ఆర్కిటెక్ట్ గౌరవ్‌కుమార్ అన్నారు. ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఎస్ఐటీఈ) కిట్స్ స్టూడెంట్ చాప్టర్‌తో పాటు 10 విభాగాల సంయుక్త ఆధ్వర్యాన కిట్స్‌లో రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయ విద్యార్థి సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన గౌరవ్‌కుమార్ స్టార్టప్‌లపై ఇన్నోవేషన్, ఇండస్ట్రీ దృక్పథంలోని అంశాలను వివరించారు. ఇన్నోవేషన్ ఆచరణాత్మకంగా, సాధ్యమయ్యేలా స్థిరంగా ఉండాలని చెప్పారు. అనంతరం సావనీర్ విడుదల చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో కిట్స్ కళాశాల పాలకవర్గ సభ్యులు, రిటైర్డ్ న్యాయమూర్తి కె.దేవీప్రసాద్, డాక్టర్ పవన్‌కుమార్, ప్రొఫెసర్ శ్రీలత, ప్రొఫెసర్ ఎం.నర్సింహారావు, డాక్టర్ మధుకర్‌రెడ్డి, డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ ప్రభాకరాచారి తదితరులు పాల్గొన్నారు.

'రోడ్డు' భద్రతే ధ్యేయం!



రోడ్డు ప్రమాదాల నివారణలో వారి పాత్ర కీలకం. నిత్యం రోడ్లపైనే విధులు నిర్వర్తిస్తూ.. ప్రయాణికులకు దిక్సూచిలా నిలుస్తారు. వేగానికి కళ్లెం వేస్తారు. సేఫ్ జర్నీకి సూచికలవుతారు. ఈక్రమంలో పాడైపోయిన రోడ్డును చూసి వారు ఊరుకోలేదు. తట్టా పారా చేతికందుకుని గుంతలు పూడ్చారు. వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలను శుక్రవారం వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, సిబ్బంది రెడీమిక్స్‌తో మరమ్మతులు చేస్తుండగా 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

– సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్


కంట్రోల్ రూం ప్రారంభం



హన్మకొండ అర్బన్: ధాన్యం కొనుగోళ్లలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కంట్రోల్ రూంను శుక్రవారం హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు అధికారులు కంట్రోల్ రూంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. ధాన్యం కొనుగోలు, లారీలు, గోనె సంచులు, కొనుగోళ్ల ప్రక్రియ మానిటరింగ్ తదితర సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూం 73307 51364 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఉమారాణి, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేరుకే మద్దతు..!

- పత్తి రైతులకు తప్పని దళారుల బెడద
- కొనుగోళ్లకు ససేమిరా అంటున్న సీసీఐ
- 18 రోజుల్లో కొనుగోలు చేసింది 28,602 క్వింటాళ్లే
- పల్లెల్లో ఎక్కడపడితే అక్కడ కాంటాలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



సాక్షిప్రతినిధి, వరంగల్ :

పత్తి సాగు చేసిన రైతులకు ఈసారి 'మద్దతు' అందని ద్రాక్షలానే కనిపిస్తున్నది. ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా సేకరించిన పత్తిని మార్కెట్‌లకు తరలిస్తున్న రైతులకు మళ్లీ దళారుల బెడదే ఎదురవుతోంది. కేంద్రం ప్రకటించిన కొత్త మద్దతు ధర ఈనెల ఒకటో తేదీ నుంచి అమల్లోకి రాగా.. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఇంకా కొనుగోళ్లకు శ్రీకారం చుట్టలేదు. గతేడాది ఉమ్మడి జిల్లాలో 23 కొనుగోలు కేంద్రాలు తెరిచిన సీసీఐ.. ఈసారి ఇంకా వేచిచూసే ధోరణిలో ఉంది. దీంతో రైతులు వ్యవసాయ మార్కెట్లలో ప్రైవేట్ వ్యాపారులతో పాటు పల్లెల్లో కాంటాలు పెడుతున్న దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఫలితంగా రైతులకు కేంద్రం ప్రకటించిన క్వింటాకు రూ.7,521 మద్దతు ధర దక్కడం లేదు. అధికారికంగా మార్కెట్లలో కొనుగోళ్లు ప్రారంభమైనా ఇప్పటికీ(14 రోజుల్లో) 28,602 క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు మార్కెటింగ్ అధికారులు శుక్రవారం ప్రకటించారు. ఈ లెక్కన పత్తి కొనుగోళ్ల విషయంలో ప్రైవేట్ వ్యాపారులు, దళారులదే పైచేయిలా కనిపిస్తున్నది.

5.13 లక్షల ఎకరాల్లో సాగు..

ఉమ్మడి వరంగల్‌లో పత్తి సాగు విస్తీర్ణం అంచనా 4,10,980 ఎకరాలు కాగా.. 5,13,289 ఎకరాల్లో సాగైంది. 4,10,632 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. పత్తి సేకరణ ఊపందుకుంది. ఈనెల ఒకటి నుంచి 18వ తేదీ(శుక్రవారం) వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 28,602 క్వింటాళ్ల పత్తిని వ్యవసాయ మార్కెట్లలో వ్యాపారులు కొనుగోలు చేశారు. శుక్రవారం 3,659 క్వింటాళ్లు కొనుగోలు జరగ్గా.. గరిష్టంగా క్వింటాకు రూ.7,000, కనిష్టంగా రూ.6,000 ధర పడింది. ఇదిలా ఉంటే ప్రస్తుతం కొత్తపత్తితోపాటు నామమాత్రంగా వస్తున్న పాతపత్తిని ద్వితీయ శ్రేణి వ్యాపారులే కొనుగోలు చేస్తున్నారు. అధిక తేమ శాతం, నాణ్యత లేని పత్తిని తక్కువ ధరకు కొనుగోలు చేసి మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల్లో విక్రయించేందుకు వీలుగా పత్తిని ఆరబెట్టడంపై దృష్టి సారించారు. అయితే ఇంకా కొనుగోళ్లు మొదలు పెట్టని సీసీఐ.. మార్కెట్‌లకు తేమ లేకుండా పత్తి తీసుకు రావాలని సూచిస్తున్నది.

జిన్నింగ్ మిల్లులకే సం'పత్తి'..

ఉమ్మడి జిల్లాలో పత్తి కొనుగోళ్లకు ఈసారి కూడా వరంగల్, జనగామ, నర్సంపేట, ఘన్‌పూర్, రాయపర్తి, పరకాల, నెక్కొండ, కేసముద్రం, మహబూబాబాద్, తొర్రూరు, కాటారం, ఆత్మకూరు, ములుగు, చేర్యాల ప్రాంతాలనే యంత్రాంగం ఎంచుకుంది. అయితే ఈ కొనుగోలు కేంద్రాలను జిన్నింగ్ మిల్లుల్లోనే ఏర్పాటు చేయనుండగా.. వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఈనెల ఒకటి నుంచే ప్రారంభించారు. మద్దతు ధర ఇవ్వాలని వ్యాపారులకు అధికారులు సీరియస్‌గా చెప్పారు. అయితే ఇదే సమయంలో మార్కెట్లకు వెళ్తే కొందరు అధికారులు 'ఇక్కడికెందుకొస్తున్నారు.. జిన్నింగ్ మిల్లుకే వెళ్లండి.. సీసీఐ అక్కడే కొంటోంది' అంటూ పంపుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో సీసీఐ, జిన్నింగ్ మిల్లర్ల మాయాజాలంతో వ్యవసాయ మార్కెట్లు అలంకారప్రాయంగా మారుతున్నాయి. పత్తి రైతులకు బాసటగా నిలవాల్సిన యార్డులు కేవలం వ్యాపారుల క్రయ, విక్రయాలకే వేదికవడం ఆరోపణలకు తావిస్తోంది. సీసీఐ అనుసరిస్తున్న తీరు పరోక్షంగా జిన్నింగ్ మిల్లులకు కాసుల పంట పండిస్తున్నట్లు స్పష్టమవుతోంది. వ్యాపారులకు పరోక్షంగా మద్దతు పలికేందుకే సీసీఐ ఇంకా కొనుగోళ్లను ఉధృతం చేయలేదన్న ఆరోపణలు కూడా వస్తున్నాయి.

వ్యాపారులు కుమ్మక్కయారు



మార్కెట్‌కు 9 బస్తాల పత్తి తీసుకువచ్చాను. ఉదయం క్వింటాకు రూ.6,500 ధర నిర్ణయించారు. తర్వాత ఖరీదుదారుడు వచ్చి తేమ ఎక్కువ ఉంది రూ.5,300 ఇస్తాననడంతో ఒప్పుకోలేదు. మొదట 5 బస్తాలు మాత్రమే కొంటాను.. మిగిలిన 4 బస్తాలు వద్దని అనడంతో పక్కనే ఉన్నే రైతులు జోక్యం చేసుకోగా చివరకు రూ.6,200 ధర నిర్ణయించి కొనుగోలు చేశారు.

– వీరమల్ల కుమారస్వామి, రైతు, గొర్రెకుంట

కేయూ వీసీగా ప్రతాప్‌రెడ్డి

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- 32 ఏళ్ల బోధనా అనుభవం
- నేడు వైస్‌చాన్స్‌లర్‌గా బాధ్యతల స్వీకరణ



ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ (వీసీ)గా హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ జువాలజీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత వీసీ రమేశ్ పదవీకాలం ఈఏడాది మే 21తో ముగియగా ఈనెల 16వ తేదీ వరకు ఐఏఎస్ వాకాటి కరుణ ఇన్‌చార్జ్ వీసీగా బాధ్యతలు నిర్వర్తించిన విషయం విదితమే. రంగారెడ్డి జిల్లా యాచారం గ్రామానికి చెందిన ప్రతాప్‌రెడ్డి ఉస్మానియా వర్సిటీలో ఎమ్మెస్సీ (1981–1983), పీహెచ్‌డీ (1987–1988) పూర్తిచేశారు. 1989లో ఉస్మానియా యూనివర్సిటీ జువాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులై అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ఆ తర్వాత ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. 2006 నుంచి ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించారు. ప్రతాప్‌రెడ్డి 32 ఏళ్ల బోధన, 35 ఏళ్ల పరిశోధనా అనుభవం కలిగి ఉన్నారు. న్యూరోసైన్స్‌లో నైపుణ్యం కలిగి పరిశోధనలు చేశారు. ఆయన పర్యవేక్షణలో 29 మంది పరిశోధకులు పీహెచ్‌డీ చేశారు. ప్రతాప్‌రెడ్డి.. 12 ప్రధాన పరిశోధన ప్రాజెక్టులను పూర్తి చేయడంతో పాటు డీబీటీ, డీఎస్‌టీ, సీఎస్ఐఆర్‌హెచ్ మొదలైన వాటి నుంచి జాతీయ, అంతర్జాతీయంగా 80 పరిశోధన పత్రాలు ప్రచురించారు. ఇంపాక్ట్ ఫ్యాక్టర్‌తో జర్నల్స్ ఫిజియాలజీ, బయోటెక్నాలజీలో 5 పుస్తకాలు రచించారు. ఆయన ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరోసైన్స్ బహుమతి, యూజీసీ–బీఎస్ఆర్ మిడ్ కెరీర్ అవార్డు గ్రహీత కూడా. 2017లో రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్నారు.

అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ అనుభవం..

ప్రతాప్‌రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీలో 2013–2014 సంవత్సరం రిజిస్ట్రార్, డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ ఆడిట్, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, ఎడ్‌సెట్ కన్వీనర్, జాతీయ సేవాపథకం ప్రోగ్రాం ఆఫీసర్, వార్డెన్, స్టూడెంట్స్ అడ్వైజర్ బాధ్యతలు నిర్వర్తించారు. జువాలజీ బోర్డు అధిపతి, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్, హెల్త్‌కేర్ కోర్సు కోఆర్డినేటర్, చైర్మన్ బాధ్యతలు నిర్వర్తించారు. 2021లో ఉద్యోగ విరమణ పొందారు. ప్రతాప్‌రెడ్డి నేడు వీసీగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

వర్సిటీ అభివృద్ధికి కృషి

కాకతీయ యూనివర్సిటీ ఇప్పటికే న్యాక్ ఏప్లస్ గ్రేడ్ కలిగి ఉంది. వర్సిటీని అన్నివిధాలా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తా. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేలా చర్యలు తీసుకోవడం, అకడమిక్ పరంగా పలు మార్పులతో ముందుకెళ్తాం. ఉద్యోగ, అధ్యాపకుల సమస్యలు కూడా మా పరిధిలో పరిష్కరిస్తాం. రెగ్యులర్ అధ్యాపకుల కొరత అన్ని వర్సిటీల్లోనూ ఉంది. వీరి నియామకానికి ప్రభుత్వం సుముఖంగానే ఉంది. రాబోయే కాలంలో అధ్యాపకుల నియామకాలు జరిగే అవకాశాలున్నాయి.

– ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి, వీసీ

అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి

- ఎంపీ బలరాంనాయక్
- వరంగల్ కలెక్టరేట్‌లో 'దిశ' సమావేశం
- విద్య, పౌరసరఫరాలపై సుదీర్ఘ చర్చ




దిశ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బలరాంనాయక్

వరంగల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు అర్హులకు అందించాలని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ అధికారులను ఆదేశించారు. వరంగల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీ బలరాంనాయక్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం శుక్రవారం జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ బలరాంనాయక్ మాట్లాడుతూ కేంద్రం నుంచి నిధులను రాబట్టుకొని ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో జిల్లాను ప్రగతిపథంలో తీసుకెళ్తామని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. విద్య, పౌరసరఫరాలపై సుదీర్ఘంగా చర్చించారు. బియ్యం అక్రమ రవాణాకు పాల్పడే రేషన్ డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. గ్రేటర్ అధికారులు పైపులైన్ లీకేజీలు అరికట్టి తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని పేర్కొన్నారు. నర్సంపేటలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలని, విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవడంతోపాటు రేషనలైజేషన్ చేయాలన్నారు. జిల్లాకు లక్షల ఎకరాలకు సాగునీరందించే జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. స్మార్ట్‌సిటీ గడువు పెంచేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకోవడంపై మేయర్ గుండు సుధారాణి హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, నర్సంపేట నియోజకవర్గంలో కృషి విజ్ఞాన్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, పాఠశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పోలీస్ స్టేషన్లకు అనుసంధానం చేయాలని, ఏనుమాములలో యూపీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు కోరారు. సమావేశంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపల్ చైర్‌పర్సన్లు గుంటి రజిత, ఆంగోత్ అరుణ పాల్గొన్నారు.

మంత్రి సురేఖ గైర్హాజరు..

ఎంపీ బలరాంనాయక్ అధ్యక్షతన జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో వరంగల్ తూర్పు ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. అన్ని శాఖలపై చర్చించే ఈ సమావేశంలో మంత్రితోపాటు వరంగల్ ఎంపీ కడియం కావ్య, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విరెడ్డి సైతం గైర్హాజరయ్యారు.

గ్రూప్స్ పరీక్షల నిర్వహణకు సన్నద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్ : జిల్లాలో గ్రూప్స్ పరీక్షల నిర్వహణకు అధికారులు సిద్ధంగా ఉన్నారని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. శుక్రవారం గ్రూప్స్ పరీక్షల నిర్వహణ, తీసుకోవాల్సి చర్యలపై స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి కలెక్టర్లతో నిర్వహించిన వీసీలో ఆమె ఇక్కడి నుంచి మాట్లాడారు. నవంబర్ 17, 18 తేదీల్లో జరిగే గ్రూప్–3 పరీక్ష నిర్వహణకు జిల్లాలో 83 కేంద్రాలు ఏర్పాటు చేశామని, 10 మంది సీనియర్ జిల్లా స్థాయి అధికారులను నియమించినట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాలను పరిశీలించి వెంటనే వివరాలు అప్‌లోడ్ చేస్తామని తెలిపారు. అలాగే ప్రశ్న పత్రాలు, ఇతర ముఖ్యమైన సామగ్రిని భద్రపరచేందుకు రెండు స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అలాగే డిసెంబర్ 15, 16 తేదీల్లో జరిగే గ్రూప్–2 పరీక్షల నిర్వహణకు సన్నద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. వీసీ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, పోలీస్, రెవెన్యూ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు, కలెక్టర్ ప్రావీణ్య

కాజీపేట అర్బన్: రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రియను చేపడుతోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. శుక్రవారం గ్రేటర్ పరిధి కడిపికొండలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. సన్న రకం ధాన్యాన్ని ఎన్ని క్వింటాళ్లు పండిస్తే అన్ని క్వింటాళ్లను కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ.. ఈసారి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డు బియ్యం వేర్వేరుగా కొనుగోలు చేసేలా ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ నుంచి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి తెలుపు, నీలిరంగు టోకెన్లను ఇవ్వాలని ఏఈఓలను ఆదేశించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇండ్ల నాగేశ్వర్ రావు, అనిత రంజిత్, దర్గా కాజీపేట పీఏసీఎస్ చైర్మన్ వనంరెడ్డి, డీసీఓ నీరజ, జిల్లా పౌరసరఫరాల అధికారి ఉమారాణి, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల సందర్శన

కాజీపేట మండలం కడిపికొండలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలను కలెక్టర్ ప్రావీణ్య శుక్రవారం సందర్శించారు. పాఠశాల రికార్డులు తనిఖీ చేశారు. కాజీపేట తహసీల్దార్ భావుసింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

డీఎంహెచ్‌ఓ లలితాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ లలితాదేవి

ఎంజీఎం : లక్ష్య సాధన కోసం వైద్యులు, వైద్య సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.లలితాదేవి అన్నారు. శుక్రవారం హనుమకొండ డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, పల్లె దవాఖాన, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులతో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యాన వివిధ కార్యక్రమాలను సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ జిల్లాలో మూడు నెలలుగా ఇంటింటి సర్వే, ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా సీజనల్ వ్యాధులను నియంత్రించగలిగామని చెప్పారు. అన్ని ఆరోగ్య కార్యక్రమాలకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి అందరూ సమన్వయంతో కృషి చేయాలన్నారు. మాతా, శిశు సంక్షేమంలో భాగంగా గర్భిణులను 12 వారాలలోపే గుర్తించి నమోదు చేయడంతోపాటు సాధారణ ప్రసవాలను పెంచాలని సూచించారు. ఎన్‌సీడీ వ్యాధుల స్క్రీనింగ్‌లో డయాబెటిస్, హైపర్ టెన్షన్ రోగులకు ప్రతి నెలా ఉచితంగా ముందులు అందజేయాలని, మందుల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ–ఔషధి పోర్టల్‌లో మందుల వివరాలు నిత్యం నమోదు చేయాలని, టెలి కన్సల్టేషన్, ఈ సంజీవని సేవలను మరింత మెరుగ్గా అందించాలని సూచించారు. కార్యక్రమంలో పీఓడీటీటీ డాక్టర్ కృష్ణారావు, క్షయ నియంత్రణ జిల్లా అధికారి డాక్టర్ హిమబిందు, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఇఫ్తాదర్ అహ్మద్, ఎంహెచ్ఎన్ పీఓ డాక్టర్ నాగరాజు, జిల్లా మాస్ మీడియా అధికారి వి.అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళలతో విద్యార్థుల్లో ఒత్తిడి దూరం



మాట్లాడుతున్న డీఈఓ వాసంతి



వరంగల్‌లో నిర్వహించిన కళా ఉత్సవ్ విజేతలు, నిర్వాహకులు

- డీఈఓ వాసంతి

విద్యారణ్యపురి: విద్యార్థులు ఒత్తిడితో కూడిన నేటి చదువులను జయించాలంటే ఆసక్తి ఉన్న ఒక కళను ఎంచుకుని అభ్యాసం చేయాలని డీఈఓ వాసంతి అన్నారు. శుక్రవారం హనుమకొండ డైట్ కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలను ఆమె ప్రారంభించారు. ఈపోటీల్లో 68 పాఠశాలలకు చెందిన సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు ఆమె తెలిపారు. వివిధ అంశాల్లో విద్యార్థులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ శ్రీనివాస్, హనుమకొండ ఎంఈఓ కుర్ర రమేశ్, ఆర్గనైజర్లు జీహెచ్ఎంలు శైలజ, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికి తీసేందుకే పోటీలు

వరంగల్: విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు పోటీలు దోహదపడతా యని వరంగల్ జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఉండ్రాతి సుజన్‌తేజ అన్నారు. వరంగల్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్ వేదికగా శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో 13 మండలాల విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వారికి ముఖ్యఅతిథి బహుమతులు ప్రదానం చేసి అభినందించారు.

అట్రాసిటి కేసులను పరిష్కరించాలి

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటయ్య

వరంగల్: ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి అధికారులు కృషి చేయాలని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. వరంగల్ కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అట్రాసిటి కేసులను త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ నియామకాల్లో రోల్ ఆఫ్ రిజర్వేషన్లను కచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. విదేశీ విద్యా పథకం, గురుకుల పాఠశాలల్లో ఎస్సీ విద్యార్థులకు అందుతున్న భోజనం, వసతి, సౌకర్యాలు, బెస్ట్ అవైలబుల్ స్కూళ్లపై సమీక్షించారు. కమిషన్ సభ్యులు ప్రవీణ్, లక్ష్మీనారాయణ, లీలాదేవి, రాంబాబునాయక్, డీసీపీ రవీందర్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తెలంగాణ బ్యాడ్మింటన్ కోచ్‌గా రమేశ్


కూరపాటి రమేశ్

వరంగల్ స్పోర్ట్స్: చెన్నైలో ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించే యోనెక్స్ సన్‌రైజ్ జాతీయ స్థాయి సబ్‌జూనియర్స్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్టు కోచ్‌గా హనుమకొండ డీఎస్ఏ కోచ్ కూరపాటి రమేశ్ ఎంపికయ్యారు. ఈ మేరకు తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి పుల్లెల గోపీచంద్ శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా రమేశ్‌ను బ్యాడ్మింటన్ సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ రమేశ్‌రెడ్డి, అధ్యక్షుడు డాక్టర్ రమేశ్‌కుమార్, కోశాధికారి నాగకిషన్, డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్ అభినందించారు.

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి రెజ్లింగ్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో అండర్–14,17 బాలుర రెజ్లింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దస్రూనాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు పుట్టిన తేదీ, స్టడీ సర్టిఫికెట్లతో ఉదయం 9గంటలకు రిపోర్టు చేయాలని తెలిపారు.

'ఎస్‌జీఎఫ్' క్రీడాపోటీల షెడ్యూల్ విడుదల

వరంగల్ స్పోర్ట్స్: ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో నిర్వహించనున్న అండర్–19 ఎస్‌జీఎఫ్ బాలబాలికల క్రీడా పోటీల వివరాలను హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్ శుక్రవారం ప్రకటించారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈనెల 25వ తేదీన మొదటి విడతలో అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్, నెట్‌బాల్, కరాటే, లాన్‌టెన్నిస్, బాస్కెట్‌బాల్, సాఫ్ట్‌బాల్, క్రికెట్, స్విమ్మింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 26వ తేదీన ఖోఖో, తైక్వాండో, బాక్సింగ్, చెస్, జిమ్నాస్టిక్స్, హాకీ, వెయిట్ లిఫ్టింగ్, ఆర్చరీ, ఫెన్సింగ్, జూడోను వరంగల్‌లోని ఓసిటీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, లేటెస్ట్ బోనోఫైడ్, ఎస్ఎస్‌సీ మెమో జిరాక్స్ ప్రతులపై కళాశాల ప్రిన్సిపల్ సంతకం చేసుకుని ఉదయం 8గంటలకు స్టేడియంలో రిపోర్టు చేయాలని తెలిపారు. వివరాలకు 98492 10746, 9963336559, 80084699219 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

వీసీలు.. మనోళ్లే



కొంతకాలంగా ఇన్‌చార్జ్‌ల పాలనలో కొనసాగుతున్న రాష్ట్రంలోని పలు యూనివర్సిటీలకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి స్థాయి వైస్ చాన్స్‌లర్లను నియమించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ఇద్దరు ఉమ్మడి వరంగల్‌కు చెందిన వారికి వీసీ పదవులు లభించాయి. నల్లగొండ జిల్లాలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీకి హనుమకొండ జిల్లా కాజీపేటకు చెందిన ఖాజా అల్తాఫ్ హుస్సేన్, నిజామాబాద్‌లోని తెలంగాణ యూనివర్సిటీకి వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నల్లబెల్లికి చెందిన యాదగిరిరావు వీసీలుగా నియమితులయ్యారు. వీరి నియామకంపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎంజీ వర్సిటీ వీసీగా అల్తాఫ్ హుస్సేన్

- కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్‌కు రెండోసారి అవకాశం


ఖాజా అల్తాఫ్‌హుస్సేన్, వీసీ, మహాత్మాగాంధీ యూనివర్సిటీ

కేయూ క్యాంపస్: నల్లగొండ జిల్లాలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీగా కాకతీయ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం రిటైర్డ్ ఆచార్యుడు ఖాజా అల్తాఫ్ హుస్సేన్ నియమితులయ్యారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీకి మరోసారి వీసీగా నియమితులు కావడం విశేషం. హనుమకొండ జిల్లా కాజీపేటకు చెందిన అల్తాఫ్‌హుస్సేన్1986లో కాకతీయ యూనివర్సిటీలో ఫిజిక్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. 1994లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2004లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీత కూడా. కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్, యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, రెండుసార్లు అదనపు పరీక్షల నియంత్రణాధికారి, ఐక్యూఏసీ డైరెక్టర్ బాధ్యతలు నిర్వర్తించారు. పలువురు పరిశోధకులు అయన వద్ద పీహెచ్‌డీ పూర్తిచేశారు


మహాత్మాగాంధీ వర్సిటీకి మరోసారి వీసీగా..

మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీగా ప్రొఫెసర్ అల్తాఫ్‌హుస్సేన్‌కు మరోసారి అవకాశం లభించింది. గతంలో 2016 జూన్30న యూనివర్సిటీ వీసీగా నియమితులై 2019 జూన్ 29వరకు బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం ప్రొఫెసర్‌గా సర్వీస్ ఉండడంతో కాకతీయ యూనివర్సిటీలో ఫిజిక్స్ విభాగంలో మరో ఆరునెలలపాటు ఆచార్యుడిగా కొనసాగారు. 2019 డిసెంబర్‌లో ఉద్యోగ విరమణ పొందారు. కాగా, మహాత్మాగాంధీయూనివర్సిటీకి మరోసారి వీసీగా అవకాశం రావడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ తాను వీసీగా గత టర్మ్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశానని, అకడమిక్ పరంగా కూడా నాణ్యమైన విద్యనందించేలా కృషిచేశానన్నారు. ఆ యూనివర్సిటీకే వీసీగా రెండో సారి అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు.

టీయూ వీసీగా యాదగిరిరావు..

నిజామాబాద్‌లోని తెలంగాణ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆచార్యుడు టి.యాదగిరిరావు నియమితులయ్యారు. టి.యాదగిరిరావు వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నల్లబెల్లికి చెందిన వారు. హనుమకొండలోని సుబేదారి టీచర్స్ కాలనీలో స్థిరపడ్డారు. కేయూలో ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో 1988లో పీజీ పూర్తిచేశారు. 1991లో కేయూ ఎస్‌డీఎల్‌సీఈలో కోర్సుకో ఆర్డినేటర్ విధులు నిర్వర్తించారు. 2007లో కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. ఆతరువాత 2009లో అసోసియేట్ ప్రొఫెసర్, 2011ప్రొఫెసర్‌గా పదోన్నతి పొంది ప్రస్తుతం సీనియర్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు. 28 సంవత్సరాల బోధన, పరిశోధన అనుభవం కలిగి ఉన్నారు. యాదగిరిరావు పర్యవేక్షణలో 22 మంది పీహెచ్‌డీలు, 9 మంది ఎంఫిల్ పట్టాలు పొందారు. 17 పబ్లికేషన్స్ ఉన్నాయి. పబ్లిక్‌అడ్మినిస్ట్రేషన్ హెచ్ఆర్ఎం విభాగం అధిపతి, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్, కేయూ యూజీసీ కోఆర్డినేటర్ బాధ్యతలు నిర్వర్తించారు. తెలంగాణ యూనివర్సిటీలో సోషల్‌సైన్స్‌డీన్ బాధ్యతలు కూడా నిర్వర్తించారు. 2021లో రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు కూడా పొందారు.

నాణ్యమైన విద్య అందేలా చర్యలు



తెలంగాణ యూనివర్సిటీలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకుంటా. అకడమిక్ పరంగా వర్సిటీలో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాల్సి ఉంది. ఇదే యూనివర్సిటీలో సోషల్ సైన్స్‌డీన్‌గా బాధ్యతలు నిర్వర్తించా. యూనివర్సిటీలోని పలు సమస్యలపై అవగాహన ఉంది. వీటిని పరిష్కరించి వర్సిటీ అభివృద్ధికి కృషిచేస్తా.

-ప్రొఫెసర్ యాదగిరిరావు, వీసీ, టీయూ

దేశభక్తి పెంపునకు 'వీర్‌గాథ'

- పాఠశాల స్థాయిలో విద్యార్థులకు పోటీలు
- వీరుల ధైర్య సాహసాలను తెలియజేయడమే లక్ష్యం



విద్యారణ్యపురి: పాఠశాల స్థాయి విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించే లక్ష్యంతో వీర్ గాథ 4.0 పోటీలను నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మూడో తరగతి విద్యార్థుల నుంచి ఇంటర్ విద్యార్థుల వరకు పోటీలు నిర్వహించనున్నారు. విద్యార్థులకు రక్షణ, విద్యామంత్రిత్వ శాఖ సంయుక్తంగా వీర్‌గాథ 4.0 పేరిట పోటీలకు సంబంధించి డీఈఓ జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ప్రిన్సిపాళ్లకు తాజాగా ఆదేశాలు జారీ చేశారు. హనుమకొండ జిల్లాలో అన్ని యాజమాన్యాలు కలిపి మొత్తం 967 పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో, విద్యా సంస్థల్లో మొదటగా పాఠశాల స్థాయిలో విద్యార్థులకు పోటీలు నిర్వహించాల్సి ఉంటుంది. ఆ వివరాలన్నీ వీర్‌గాథ పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. కాగా.. గ్యాలంట్రీ అవార్డు గ్రహీతలైన సైనిక వీరుల ధైర్య సహసాలు, త్యాగాలు, జీవిత గాథలను నేటి విద్యార్థులకు పరిచయం చేయడానికి ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు, వెబినార్ల ద్వారా వివిధ సెషన్లలో దృశ్యరూపకంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

20లోగా పోటీలు..

ఈనెల 20వ తేదీలోగా పాఠశాల స్థాయిలో పోయమ్ రైటింగ్, ఎస్సే రైటింగ్, డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రతీ కేటగిరీలో మొదటి స్థానంలో నిలిచిన ఎంట్రీని (మొత్తం 4 ఎంట్రీలు) ప్రధానోపాధ్యాయుడు ఆదివారంలోగా మైగౌట్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఉన్నతాధికారులు జిల్లా స్థాయిలో మొదటి నలుగురిని, రాష్ట్ర స్థాయిలో మొదటి 8 మందిని, జాతీయ స్థాయిలో మొదటి 100 మందిని (సూపర్ 100) ఎంపిక చేసి వచ్చే గణతంత్ర దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తారు.

వీర్‌గాథ విజేతలు..

సూపర్ 100 విజేతల్లో వీర్‌గాథ పోటీల్లో ఒక స్థాయిలో ఎంపికైన వారిని మరో స్థాయిలో ఎంపిక చేయకుండా వేర్వేరు విద్యార్థులను ఎంపిక చేస్తారు. జిల్లా స్థాయి పోటీల్లో నలుగురిని విజేతలుగా ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపిస్తారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో 8 మందిని విజేతలుగా గుర్తించి జాతీయ స్థాయికి పంపుతారు. జాతీయస్థాయి పోటీల్లో వంద మందిని విజేతలుగా ప్రకటిస్తారు. వీరిని సూపర్ 100 విజేతలుగా పిలుస్తారు. ఇందులో మూడు నుంచి 5వ తరగతి వరకు 25 మందిని ఆరు నుంచి 8వ తరగతి వరకు 25 మందిని తొమ్మిది నుంచి పదో తరగతి వరకు 25 మంది విద్యార్థులను ఇంటర్ నుంచి 25 మంది విద్యార్థులను జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. జిల్లా రాష్ట్ర స్థాయిలోని పోటీల విజేతలకు సత్కారం, సర్టిఫికెట్ అందజేస్తారు. జాతీయస్థాయి విజేతలకు విద్యా, రక్షణ మంత్రిత్వ శాఖలు రూ.10 వేలు చొప్పున నగదును అందజేస్తాయి. సత్కారం ఉంటుంది.

వివిధ కేటగిరీలు విద్యార్థులు(తరగతివారీగా) పోటీలు

- కేటగిరీ–1 3,4,5 కవితలు, వ్యాస రచన 150 పదాలు, డ్రాయింగ్/పెయింటింగ్
- కేటగిరీ–2: 6, 7,8 కవితలు, వ్యాస రచన 300 పదాలు, డ్రాయింగ్/పెయింటింగ్
- కేటగిరీ–3: 9,10 కవితలు, వ్యాస రచన 750 పదాలు, డ్రాయింగ్/పెయింటింగ్)
- కేటగిరీ–4: 11,12 కవితలు, వ్యాస రచన 1,000 పదాలు, డ్రాయింగ్/పెయింటింగ్ నా రోల్ మోడల్ (గ్యాలంట్రీ అవార్డు విజేత)...

ఎక్కువ మంది పాల్గొనేలా చూడాలి



హనుమకొండ జిల్లాలోని అన్ని పాఠశాలల్లో మూడు నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులు పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు చూడాలి. ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు వీర్‌గాథపై దృష్టి కేంద్రీకరించి ప్రతీ పాఠశాలను వీర్‌గాథ వెబ్ పోర్టల్ లో నమోదు చేయాలి. తర్వాత విద్యార్థులకు పోటీలు నిర్వహించి నలుగురిని ఎంపిక చేసి పోర్టల్ లో అప్లోడ్ చేయాలి. కేంద్ర ప్రభుత్వం దరఖాస్తు చేసుకునే గడువును పెంచే అవకాశం ఉంది.

- డి.వాసంతి, డీఈఓ, హనుమకొండ

దేశం గర్వపడేలా విజయాలు సాధించాలి

- తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- గవర్నర్‌ను కలిసిన మౌంటెనర్ యశ్వంత్


తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మౌంటైనర్ యశ్వంత్

మరిపెడ రూరల్: ప్రపంచ వేదికపై భారతదేశం గర్వపడేలా గొప్ప విజయాలు సాధించాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్యతండా గ్రామ పంచాయతీకి చెందిన మౌంటైనర్ భూక్య యశ్వంత్ రాష్ట్ర గవర్నర్‌ను హైదరాబాద్ రాజ్ భవన్‌లో గురువారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపాడు. అనంతరం గవర్నర్ యశ్వంత్ విజయాలను ప్రశంసిస్తూ వెల్ డన్ మై బోయ్ అని అభినందించాడు. అరుణాచల్ ప్రదేశ్‌లోని 'గోరిచెన్' పర్వతాన్ని అధిరోహించిన అతిపిన్న వయస్కుడిగా విజయం సాధించడం గొప్ప విషయమన్నారు. ఈ కీర్తి తెలంగాణ రాష్ట్రం, యావత్ భారత్ దేశానిదిగా చెప్పవచ్చునని పేర్కొన్నారు. భవిష్యత్‌లో గొప్ప విజయాలు సాధించి భారత దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటాలని యశ్వంత్‌ను గవర్నర్ ఆశీర్వదించారు.

మాజీ డిప్యూటీ మేయర్ రవీందర్ కన్నుమూత

- పార్థివదేహాన్ని సందర్శించిన కేంద్ర ఖాదీ ఇండస్ట్రియల్ బోర్డు మాజీ డైరెక్టర్ ఈగ మల్లేశం, ఎమ్మెల్సీ సారయ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు
- సంతాపం తెలిపిన టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్, మంత్రులు కొండా సురేఖ, సీతక్క


రవీందర్ (ఫైల్)


రవీందర్ పార్థివదేహాన్ని సందర్శిస్తున్న ఈగ మల్లేశం

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేగేట్ ప్రాంతం పెరకవాడకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, వరంగల్ మాజీ డిప్యూటీ మేయర్ ఎంబాడి రవీందర్ కన్నుమూశారు. కొద్ది రోజుల క్రితం గుండె సమస్య తలెత్తడంతో వైద్యులు స్టాంట్ వేయగా విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆరోగ్యం మెరుగు పడిందనుకునే సమయంలో మళ్లీ పరిస్థితి విషమించింది. కుటుంబ సభ్యులు హుటాహుటిన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు ప్రకటించారు. రవీందర్‌కు భార్య అరుణ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. హైదరాబాద్ నుంచి వరంగల్ పెరకవాడలోని ఆయన నివాసానికి రవీందర్ పార్థివదేహాన్ని తరలించారు.

వ్యాపారి నుంచి రాజకీయవేత్తగా..

వరంగల్ పెరకవాడకు చెందిన ఎంబాడి అమర్‌నాథ్, లక్ష్మీ దంపతులకు ఇద్దరు కుమారులు రవీందర్, నాగేశ్వరరావు, కుమార్తె కరుణ ఉన్నారు. ఈ దంపతుల రెండో సంతానంగా రవీందర్ 1962 డిసెంబర్ 13న జన్మించారు. రాజకీయ నాయకుడిగా, నగరంలో ప్రముఖ ఐరన్, సిమెంట్ వ్యాపారవేత్తగా ఎదిగారు. మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్యకు ప్రధాన అనుచరుడిగా పనిచేశారు. వీరు ఇద్దరు కాంగ్రెస్ పార్టీ వరంగల్ మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి ప్రధాన శిష్యులుగా ఎదిగారు. సారయ్య సహకారంతో మూడు సార్లు కార్పొరేటర్‌గా, ఐదేళ్ల పాటు డిప్యూటీ మేయర్‌గా పనిచేసి పేదల మనన్నలు పొందారు.

తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర..

తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి పడుతున్న తరుణంలో కాంగ్రెస్‌లో పనిచేస్తూ.. ఉద్యమానికి ఊపిరి నిచ్చాడు. నేను ఉన్నానంటూ కార్యకర్తలతో తరలివచ్చాడు.రహదారులపై వంట, వార్పు కార్యక్రమాల్లో భాగస్వామ్యమయ్యాడు.సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్య నింపాడు.

పలువురి సంతాపం..

నగర మాజీ డిప్యూటీ మేయర్ ఎంబాడి రవీందర్ మృతిపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు కొండా సురేఖ, సీతక్క సంతాపం తెలిపారు. రవీందర్ పార్థివ దేహాన్ని కేంద్ర ఖాదీ ఇండస్ట్రీయల్ బోర్డు మాజీ డైరెక్టర్ ఈగ మల్లేశం, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, పార్టీ రాష్ట్ర నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, మాజీ ఎమ్మెల్యే శ్రీరాంభద్రయ్య, మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, జాక్ కన్వీనర్ దిడ్డి నరేందర్, డాక్టర్ హరిరమాదేవి, రాజనాల శ్రీహరి, నగర తాజా,మాజీ కార్పొరేటర్లు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఎస్ఆర్ఆర్ తోటలోని హిందూ శ్మశాన వాటికలో రవీందర్ అంత్యక్రియలు నిర్వహించారు.

నూతన కోర్సులపై దృష్టి పెడితేనే భవిష్యత్

- ఆర్‌డీడీ సీతారాములు


మాట్లాడుతున్న ఆర్‌డీడీ సీతారాములు

ఏటూరునాగారం : ప్రస్తుత కంప్యూటర్ యుగంలో యువత నూతన సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి పెడితేనే భవిష్యత్ ఉంటుందని ఆర్‌డీడీ సీతారాములు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో ఐటీడీఏ, ఐటీఐ ఆధ్వర్యంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో ప్రవేశాల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్‌డీడీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కార్మిక శాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్య, ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా చొరవతో ఏటూరునాగారం ఐటీఐకి ఏటీసీ మంజూరైందన్నారు. ఈ సెంటర్‌లో 6 నూతన కోర్సులను ప్రవేశపెట్టి 172 మందికి శిక్షణ ఇస్తామన్నారు. ఇందులో భాగంగానే ఎంపికలు ప్రారంభించామన్నారు. వంద మంది విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. పదో తరగతి పూర్తి చేసిన వారికి ఈ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తామన్నారు. గిరిజన బాలబాలికలకు ఇది గొప్ప సదావకాశం అన్నారు. కార్యక్రమంలో డీడీ పోచం, ఎస్ఓ రాజ్‌కుమార్, వివిధ మండలాల ఐటీఐ ప్రిన్సిపాళ్లు శేఖర్, వెంకటేశ్వరరావు, జగన్‌మోహన్‌రెడ్డి, సీడీపీఓ ప్రేమలత, జేడీఎం కొండల్‌రావు, జేఆర్‌పీలు భిక్షపతి, పాపారావు, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లా గిరిజన విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకింగ్, రైల్వే, ఎస్ఎస్‌సీ, గ్రూప్స్, పోలీసులు ఇతర పరీక్షల్లో శిక్షణ ఉంటుందన్నారు. అందుకోసం ఈనెల 27వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు Studycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి ఎంపిక చేస్తామన్నారు. ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 8374417424, 9441008400 నంబర్లను సంప్రదించాలన్నారు.

రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పతకాలు


పతకాలు సాధించిన క్రీడాకారులు, కోచ్ రాజుతో డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్

వరంగల్ స్పోర్ట్స్: హైదరాబాద్‌లో ఈ నెల 15,16వ తేదీల్లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరషన్ అండర్ –19 రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా రెజ్లర్లు సత్తా చాటారు. బాలుర విభాగం గ్రీకోరోమన్ 63 కేజీల విభాగంలో వి.గణేష్, ఫ్రీస్టైల్ 92 కేజీల విభాగంలో వి.సాయివర్ధన్ స్వర్ణ పతకాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఫ్రీస్టైల్ 86 కేజీల విభాగంలో పి.అన్విత్, గ్రీకోరోమన్ 82 కేజీల విభాగంలో డి.చరణ్ రజత పతకాలు సాధించారు. ఫ్రీస్టైల్ 61 కేజీల కేటగిరీలో ఇ.వరుణ్, 65 కేజీల్లో కె.ఈశ్వర్, గ్రీకోరోమన్ 60 కేజీల కేటగిరీలో ఎ.డాన్, 67 కేజీలలో బి.సాయి నిహాల్ కాంస్య పతకాలు సాధించారని హనుమకొండ డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్ తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను, కోచ్ కందికొండ రాజును అధికారులు, అసోసియేషన్ బాధ్యులు శుక్రవారం అభినందించారు.

రైలు ఢీకొని కూలీ మృతి


తిరుపతమ్మ(ఫైల్)

కాశిబుగ్గ : రైలు ఢీకొని ఓ కూలీ మృతి చెందింది. ఈ ఘటన శుక్రవారం నెక్కొండ, ఎల్గూరు రైల్వే స్టేషన్ల మధ్య చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ పి. సురేందర్ కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం గేటుపల్లి గొల్లపల్లికి చెందిన తిరుపతమ్మ(50) పత్తి తీసేందుకు పట్టాలు దాటుతోంది. ఈక్రమంలో రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెచ్‌సీ రాజు కేసునమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతురాలి భర్త గురువయ్యకు అప్పగించామని సీఐ తెలిపారు.

దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్, రిమాండ్

వరంగల్: ఇంతేజార్‌గంజ్ పీఎస్ పరిధిలో ఒకరి వద్ద దోపిడీ చేసి మరో ఇద్దరిపై దాడికి పాల్పడిన పుల్చేరు చంద్రశేఖర్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ షుకుర్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున దారి వెంట నడుచుకుంటూ వెళ్తున్న గిర్మాజీపేటకు చెందిన పోలేపాక బాబును చంద్రశేఖర్ అడ్డగించి అతడి వద్ద ఉన్న డబ్బులు ఇవ్వాలని బెదిరించాడు. దీనికి బాబు నిరాకరించడంతో అతడిపై దాడికి పాల్పడ్డాడు. దీనిని గమనించిన ఇద్దరు వ్యక్తులు ఆపే ప్రయత్నం చేయగా వారిపై కూడా చంద్రశేఖర్ దాడికి పాల్పడి పారిపోయాడు. ఈఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పుల్చేరు చంద్రశేఖర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఇన్‌స్పెక్టర్ షుకుర్ తెలిపారు.

సబ్ జైలును సందర్శించిన జైళ్ల శాఖ డీఐజీ


జైళ్ల శాఖ డీఐజీని సన్మానిస్తున్న అధికారులు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ సబ్ జైలును తెలంగాణ జైళ్ల శాఖ డీఐజీ మాదారపు సంపత్ కుమార్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా సబ్ జైళ్ల అ ధికారి విజయ్ డేనీ..జైళ్ల శాఖ డీఐజీకి స్వాగతం ప లికారు. అనంతరం సంపత్ కుమార్ జైలు కలియతిరిగి ఖైదీలకు అందిస్తున్న సౌకర్యాలను జైలర్ శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. జైలులోని పరిశుభ్రత, ఖైదీల సంక్షేమంపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సబ్ జైలు అధికారులు డీఐజీని సన్మానించారు. జైలు ఉన్నతాధికారులు పట్టెం భిక్షపతి, సిటిజన్ ఫోరం సభ్యులు శంతన్ రామరాజు, సదానిరంజన్ పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు వెంటనే ప్రకటించాలి


మాట్లాడుతున్న శ్రీనివాస్

కాజీపేట రూరల్: ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల పెండింగ్ డీఏలను వెంటనే ప్రకటించాలని, జీఓ నంబర్ 25ను సవరించాలని కాజీపేట దర్గా హైస్కూల్‌కు చెందిన డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కటుకూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ధర్మసాగర్ మండలంలో జెడ్పీహెచ్ఎస్ మల్లక్‌పల్లి, యూపీఎస్ ధర్మపురం, జెడ్పీహెచ్ఎస్ పెద్దపెండ్యాల, తాటికాయల, పీఎస్ కరుణాపురం, పెద్దపెండ్యాల, హరిజన కాలనీ, రెడ్డిపల్లె పీఎస్ కాశెగూడెం, పీఎస్ రాపాకపల్లి, జెడ్పీహెచ్ఎస్ ఉనికిచర్ల పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి భారతి, జిల్లా ఉపాధ్యక్షురాలు ఎన్.సుభాషిని, జిల్లా కౌన్సెలర్ డి.మహానందరెడ్డి, మండల బాధ్యులు సీహెచ్.బాబురావు, రాజేష్, టి.సత్యవతి పాల్గొన్నారు.

పెండ్యాల్–హసన్‌పర్తి బైపాస్ రైల్వేలైన్‌కు నోటిఫికేషన్



కాజీపేట రూరల్ : కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని పెండ్యాల్(నష్కల్) నుంచి ధర్మసాగర్ మీదుగా హసన్‌పర్తి వరకు ఉన్న బైపాస్ రైల్వేలైన్ నిర్మాణం కోసం రైల్వే మంత్రిత్వశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు శుక్రవారం రాత్రి రైల్వే అధికారులు తెలిపారు. 24.55 కిలోమీటర్ల దూరం ఉన్న బైపాస్ లైన్ నిర్మాణం హనుమకొండ, జనగామ జిల్లాల పరిధి ధర్మసాగర్, హసన్‌పర్తి, చిల్పూర్ మండలాల మీదుగా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు హనుమకొండ, ఘన్‌పూర్ ఆర్డీఓ కార్యాలయాలకు రైల్వే శాఖ లేఖ పంపించనున్నట్లు వివరించారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించాలని నిరసన

కేయూ క్యాంపస్: కేయూలో తమకు పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించేందుకు టూ మెన్ కమిటీని నియమించాలని డిమాండ్ చేస్తూ నలుగురు అభ్యర్థులు శుక్రవారం రిజిస్ట్రార్ చాంబర్ లో పురుగుల మందు డబ్బాతోబైఠాయించారు. తమకు అడ్మిషన్ కల్పించకపోతే ఆత్మహత్య చేసుకుంటామని రిజిస్ట్రార్ మల్లారెడ్డితో వాగ్వాదానికి దిగారు. రిజిస్ట్రార్ మల్లారెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిందన్నారు. అయితే పీహెచ్‌డీ అడ్మిషన్లకు టూమెన్ కమిటీని నియమించాలంటే వీసీ అప్రూవల్ ఉండాలన్నారు. వీసీ వచ్చాక సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్తామన్నారు.